
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
ఆదివారం 6 అక్టోబరు 2024



వృద్ధురాలిని ఢీకొట్టిన సూర్యాపేట అదనపు కలెక్టర్ కారు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 5: డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారి క్రాస్ చేస్తున్న గంగారపు సరోజన అనే వృద్ధురాలిని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వీ.ఎస్. లత కారు ఢీకొట్టిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల లంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన సరోజన కొన్ని

» మిగతా 8వ పేజీలో...



లోహపు కళారూపాల తయారీలో నిమగ్నమైన పెంబర్తి కళాకారులు

Sunday SPECIAL

అద్భుతాల కళ భోష

చేనేత, హస్తకళా వైభవం ఓరుగల్లు సొంతం

- లోహపు కళారూపాల తయారీకి ప్రసిద్ధి పెంబర్తి
- చేనేత కార్పెట్లు, తివాచీలకు నిలయం వరంగల్ కొత్తవాడ
- కళను భావి తరాలకు అందించేలా కేంద్రం కార్యాచరణ
- ఉత్పత్తి, ఉపాధి పెంచేలా హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్ల ఏర్పాటు
- 'స్ఫూర్తి' పథకం కింద నిధుల కేటాయింపు
- ఉత్పత్తి, ఉపాధి పెంచేలా ప్రణాళికలు

7

కాకతీయుల కాలం నాటి కళా నైపుణ్యం.. ప్రపంచ వారసత్వ సంపదను తన కీర్తి సిగలో ఇముడ్చుకున్న ఉమ్మడి ఓరుగల్లు.. చేనేత, హస్తకళా వైభవంలోనూ మేటిగా నిలిచింది. అందుకు నిదర్శనమే జనగామ జిల్లా పెంబర్తిలో విశ్వకర్మలు ఇత్తడి, రాగి, వెండి లాంటి లోహాలతో తయారు చేసే కళారూపాలు, వరంగల్ కొత్తవాడ ప్రాంతంలో చేనేత కళాకారుల కండ నరాల నుంచి రూపుదాల్చే కార్పెట్లు, తివాచీ(దర్రీస్)లు. మన జిల్లా కార్మికుల చేతిలో తయారయ్యే ఈ కళాకృతులకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపే ఉంది. ప్రస్తుతం కనుమరుగవుతున్న ఇలాంటి సంప్రదాయ హస్తకళలను కాపాడుకుంటూ భావితరాలకు అందించేందుకు కేంద్రప్రభుత్వం నడుంబిగించింది. ఏయే ప్రాంతాల్లో ఏయే చేనేత, హస్తకళలు ప్రాచుర్యం పొందాయో.. ఆ ప్రాంతాల్లోని కళాకారులకు వృత్తి శిక్షణనిచ్చి ప్రోత్సహించనుంది. ఇందుకు హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్లను ఏర్పాటు చేసి స్ఫూర్తి పథకం కింద నిధుల కేటాయించి హస్తకళల ఉత్పత్తి, కళాకారులకు ఉపాధి కల్పించాలని సంకల్పించింది.

- జనగామ (ఆంధ్రజ్యోతి)/ ఆటోనగర్



ప్రముఖుల ఫొటోలతో వరంగల్ కొత్తవాడ చేనేత కార్మికులు నేసిన కార్పెట్లు



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



అరకొర మీనమే..!

జనగామ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఈ ఏడాది 'అరకొరగానే జరగనుంది. జిల్లాలో ముందస్తుగా విధించుకున్న లక్ష్యంలో 50 శాతం మాత్రమే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లోనూ ఈ సీజన్‌లో 50 శాతం చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి ఆయా జిల్లాల వారీగా రెడీ చేసిన యాక్షన్ ప్లాన్‌లోని టార్గెట్‌ను అధికారులు కుదించారు. గత ఏడాది జిల్లాలో 2.72 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనికి సంబంధించి ఈ ఏడాది జూన్‌లోనే యాక్షన్ ప్లాన్‌ను ఖరార చేశారు. కాగా.. ప్రస్తుతం 50 శాతానికి కుదించడంతో జిల్లావ్యాప్తంగా 1.36 కోట్ల చేప పిల్లల పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. చేప పిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియ సెప్టెంబరు 23న ముగియగా ఈనెల 7న చేప పిల్లల పంపిణీ ప్రారంభం కానుంది. 7న స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో చేప పిల్లల పంపిణీని ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 9 రిజర్వాయర్లు, 723 చెరువులు, కుంటల్లో ఈ ఏడాది 1.36 కోట్ల చేప పిల్లలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో 169 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 141 పురుషుల సంఘాలు కాగా.. 28 మహిళల సహకార సంఘాలు ఉన్నాయి. 169 సంఘాల్లో 16,868 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు.

ఊగిసలాటల మధ్య టెండరు ప్రక్రియ

ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ టెండర్ల ప్రక్రియ ఊగిసలాటల మధ్య సాగింది. గత ఏడాది టెండర్లు దక్కించుకొని చేప పిల్లలను పంపిణీ చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇంతవరకూ బిల్లులు చెల్లించలేదు. దీంతో చేప పిల్లలను పంపిణీ చేసే ఫిష్ ఫార్మర్లు (కాంట్రాక్టర్లు) ఈ ఏడాది టెండర్లకు దూరంగా ఉండాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి ప్రభుత్వానికి ముందే అల్టిమేటం సైతం జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం టెండర్లతో సంప్రదింపులు జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 100 కోట్ల మేర గత ఏడాది బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు తాము టెండర్లలో పాల్గొనలేమని తేల్చి చెప్పారు. దీంతో మత్స్యశాఖ ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లలో చర్చలు జరిపి పెండింగ్ బిల్లులు ఇస్తామని హామీ ఇచ్చారు. పాత బిల్లుల చెల్లింపులకు కట్టుబడి ఉన్నామని, టెండర్లలో పాల్గొనాలని కాంట్రాక్టర్లను అధికారులు కోరారు. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. జిల్లావ్యాప్తంగా గత ఏడాది బిల్లులు కాంట్రాక్టర్లకు సుమారు రూ. 2 కోట్లకు పైగా రావాల్సి ఉంది. కాంట్రాక్టర్ల నిరసన అనంతరం రెండు, మూడు నెలల క్రితం ఒక్కో కాంట్రాక్టర్లకు రూ. 5 లక్షల చొప్పున మాత్రమే విడుదల చేశారు. ఒక్కో కాంట్రాక్టర్‌కు రూ.80 లక్షలకు పైగా రావాల్సి ఉండగా రూ. 5 లక్షలు మాత్రమే చెల్లించ డం పట్ల కాంట్రాక్టర్లు అసంతృప్తితో ఉన్నారు. పాత బిల్లులు, కొత్త బిల్లులు ఒకేసారి వస్తాయని ఆశతో కాంట్రాక్టర్లు అయిష్టంగానే టెండర్లు వేశారు. చేప పిల్లల పంపిణీని 50 శాతానికి తగ్గించి నప్పటికీ కాంట్రాక్టర్లు టెండర్ల దాఖలు సమయంలో చెల్లిం చాల్సిన ఈఎండీ (డిపాజిట్) మాత్రం 100 శాతం కట్టించుకున్నారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. జన గామ జిల్లాకు సంబంధించిన వందశాతం చేప పిల్లల పంపిణీకి రూ.7 లక్షలు ఈఎండీ కట్టించుకు న్నారని, కానీ లక్ష్యాన్ని 50 శాతానికి కుదించారని అంటున్నా రు. 50 శాతానికి తగ్గించినప్పుడు తమతో రూ.3.50 లక్షల ఈఎండీ మాత్రమే కట్టించుకోవాలని, రూ.7 లక్షలు ఎలా కట్టించుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

- ఈసారి చేపల పిల్లల పంపిణీ 50శాతమే
- నిధులు, చెరువుల్లో నీరు లేమి కారణం?
- జిల్లాలో ముగిసిన టెండర్ల ఖరారు ప్రక్రియ
- 1.36 కోట్ల చేపపిల్లలు పోయడం లక్ష్యం
- రేపు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రారంభం



నిధులు, చెరువుల్లో నీరు లేకపోవడంతో..

చేప పిల్లల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడం, చెరువుల్లో నీరు సరిగ్గా లేకపోవడం మూలంగానే 50 శాతానికి లక్ష్యాన్ని తగ్గించారని తెలుస్తోంది. నిధుల లేమి కారణంగానే ప్రభుత్వం గత ఏడాది కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన సుమారు రూ. 100 కోట్ల బిల్లులను మంజూరు చేయడం లేదని తెలుస్తోంది. చేప పిల్లల పంపిణీకి అదను దాటిపోతుండడం, మత్స్యకారుల నుంచి కూడా డిమాండ్లు వస్తుండడంతో ప్రభుత్వం చేప పిల్లల పంపిణీని చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఏదోరకంగా కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పలువురు కాంట్రాక్టర్లు అంటున్నారు. దీనికి తోడు ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు సైతం తక్కువగా కురిసాయి. దీంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో నీరు అంతంత మాత్రంగానే ఉంది. గత ఏడాది చెరువులు నిండుగా ఉన్న సమయంలో వంద శాతం చేప పిల్లలను వదిలారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు లేకపోవడంతో అదే వంద శాతం పిల్లలను వేస్తే చేప పిల్లలు బతికే అవకాశం తక్కువగా ఉంటుంది. దీంతో లక్ష్యాన్ని సగానికి తగ్గించి ఉంటారని పలువురు మత్స్యకారులు, కాంట్రాక్టర్లు అంటున్నారు.

రేపటి నుంచి పంపిణీ

- రాణాప్రతాప్, జిల్లా మత్స్యశాఖ అధికారి, జనగామ



చేప పిల్లల పంపిణీకి సంబంధించి టెండర్ల ప్రక్రియ ముగియడంతో పంపిణీని ప్రారంభించాలని నిర్ణయించాం. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చేప పిల్లల పంపిణీని ప్రారంభించనున్నాం. ఈ నెల 7న (సోమవారం) నాడు పంపిణీ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 1.36 కోట్ల చేప పిల్లలను చెరువులు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 5: డిసెంబరు లోగా ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియపై శనివారం అదనపు కలెక్టరేట్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించే ముందు ప్రైవేట్ స్థలమా, ప్రభుత్వ స్థలమా నిర్ధారించుకోవాలన్నారు. పరిశీల నకు వెళ్లే ముందు దరఖాస్తుదారులకు ముందస్తు సమాచారం అందిస్తే వారు స్థలంలో అందుబాటులో ఉంటారన్నారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయా ల్లో ఎల్ఆర్‌యస్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని, జనగామ మున్సిపాలిటీ సంబంధించి 12,552 దరఖాస్తులు వచ్చాయని ఇందులో 144 దరఖాస్తుల సర్వే పూర్తయిందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరతగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో జనగామ ఆర్డీవో కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ టీచర్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

జనగామ రూరల్ : అర్హులైన ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఓటరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయుల ఎన్నికల నేపధ్యంలో అర్హులైన ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో మూడు ఓటరు నమోదు కేంద్రాలు, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఏర్పాటు చేశామని అర్హత కలిగిన ఆయా మండలాల ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు.

రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, అక్టోబరు 5 : రైతుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ఖమ్మంలోని రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడిల యశస్వినిరెడ్డి ఘాటుగా విమర్శించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన హోమం కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల రుణాలను మాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఏక కాలంలో రుణమాఫీ చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. మంత్రిగా ఉన్న దయాకర్‌రావు ప్రజలు తమ పార్టీని అధికారం నుంచి దింపారని గుర్తుంచుకోవాలని అన్నారు. అధికారంలో ఉన్న వారికి ప్రతిపక్షం సలహాలు ఇస్తే స్వీకరిస్తామని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పాలకుర్తి కంటే ముందు మల్లన్నసాగర్‌కు వెళ్లి అక్కడి రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ అంటేనే రైతు సంక్షేమ ప్రభుత్వం అని గుర్తు చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీని త్వరలో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని అన్నారు. సాంకేతిక సమస్య వల్ల కొంతమంది రైతులకు కాలదని తమ దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, రాఘవరావు, తిరుపతిరెడ్డి, పెనుగొండ రమేష్, హమ్యానాయక్, వీరమనేని యాకాంతరావు, ఎడవెల్లి పురుషోత్తం, శ్రీరామ్, పోగు శ్రీనివాస్, ఐలేష్ యాదవ్, జల్లం కుమారస్వామి, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, గడ్డం యాకసోమయ్య, తదితరులు ఉన్నారు.



పాలకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

'మెడికల్' విద్యార్థినులకు భోజనం బంద్?

మూడు రోజులుగా అందని అన్నం

వివరాలు 8లో..

జనగామ మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

ఇప్పటి వరకు 4,396 మెట్రిక్ టన్నుల కత్తెర పంట కొనుగోలు



జనగామ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

జనగామ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ఎడగారు(కత్తెర పంట) ధాన్యం పోటెత్తుతోంది. గత వారం రోజులుగా మార్కెట్‌కు ధాన్యం పెద్దమొత్తంలో వస్తోంది. జనగామ జిల్లాలోని పలు మండలాల్లో రబీ, ఖరీఫ్ మధ్యలో మూడో పంటగా ఎడగారు పంటను రైతులు సాగు చేస్తుంటారు. జిల్లాలో సుమారుగా 20 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. వానాకాలం వరి కోతలు ప్రారంభం అయ్యే నాటికే ఎడగారు కోతలు పూర్తవు తాయి. జిల్లాలో ప్రస్తుతం వానాకాలం వరి పంటలు కోతదశకు వచ్చాయి. మరో వారం, పది రోజుల్లో వానాకాలం కోతలు ప్రారంభం కానున్నాయి. జనగామ వ్యవసాయ మార్కెట్‌కు ఆగస్టు 21 నుంచి ఎడగారు ధాన్యం వస్తుంది. ఇప్పటి వరకు 966 మంది రైతులకు చెందిన 4398 మెట్రిక్ టన్నుల(69,284 బ్యాగులు) ధాన్యాన్ని మార్కెట్‌లో ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఈ ఖరీఫ్ నుంచి పెరిగిన మద్దతు ధర ప్రకారం రైతుకు క్వింటాకు 'ఏ' గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 కాగా.. తేమ శాతం అధికంగా ఉండడంతో కనిష్టంగా రూ. 1851, గరిష్టంగా రూ. 2121 మద్దతు ధర రైతులకు లభించింది.

అమల్లోకి కనీస మద్దతు ధరలు

జనగామ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): 2024-25 సంవత్సరానికి గానూ వివిధ రకాల పంట ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ధరలు అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వివిధ రకాల పంట ఉత్పత్తుల ధరలను పెంచుతూ కేంద్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా 20223-24 సంవత్సరంలోని ధరల కనీస మద్దతు ధరలకు సవరణ చేస్తూ 2024-25 ధరలను నిర్ణయించింది. గత ఏడాది కంటే ఎంఎస్‌పీ ధరల్లో పెరుగుదల కల్పించారు. ఈ మేరకు కేంద్రం పెంచిన ఎంఎస్‌పీ ధరలు అక్టోబరు 1 నుంచి జిల్లాలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో అమల్లోకి వచ్చాయి.

పంటల వారీగా కనీస మద్దతు ధర వివరాలు

పంట రకం	2023-24	2024-25	పెరుగుదల (రూ.లలో)
వరి- కామన్	2183	2300	117
వరి- 'ఏ' గ్రేడ్	2203	2320	117
పత్తి- మధ్య రకం	6620	7121	501
పత్తి- పొడవు రకం	7020	7521	501
మొక్కజొన్న	2090	2225	135
కంది	7000	7550	550
పెసర	8558	8682	124
మినుములు	6950	7400	450
వేరుశనగ	6377	6783	406
జొన్న- హైబ్రీడ్	3180	3371	191
జొన్న- మల్దండి	3225	3416	191
సజ్జలు	2500	2625	125
రాగులు	3846	4290	444
పొద్దుతిరుగుడు	6760	7280	520
సోయాబీన్	4600	4892	292
నువ్వులు	8635	9267	632
గడ్డి నువ్వులు	7734	8717	983

అద్భుతాల కళబోత

- చేనేత, హస్తకళా వైభవం ఓరుగల్లు సొంతం
- ఉత్పత్తి పెంచేలా కేంద్ర ప్రభుత్వ ప్రణాళికలు
- హ్యాండీక్రాఫ్ట్ క్లస్టర్ల ఏర్పాటు
- 'స్ఫూర్తి' పథకం కింద నిధుల కేటాయింపు

సండే స్పెషల్ SUNDAY SPECIAL



పెంబర్తి క్లస్టర్ కేంద్రంలో అమ్మకానికి ఉంచిన కళాకృతులు

జనగామ (ఆంధ్రజ్యోతి)/ ఆటోనగర్, అక్టోబరు 5 : మన సంప్రదాయ చేనేత, హస్తకళలను కాపాడుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళా కృతులపై అధ్యయనం చేయడంతో పాటు ఆయా కళల్లో విశిష్టత కల్గిన ప్రాంతాల అభివృద్ధిపై సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ దృష్టి సారించింది. ఏయే ప్రాంతాల్లో ఏయే హస్తకళలు ప్రాచుర్యం పొందాయో ఆయా ప్రాంతాలను క్లస్టర్లుగా ప్రకటించి.. అక్కడి ప్రాంతాల్లోని కళాకారులకు నైపుణ్య శిక్షణ, కొత్త కళాకారులకు వృత్తి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. స్ఫూర్తి పథకం కింద హస్తకళాకారుల సంఘాలకు నిధులు కేటాయించి హస్తకళల ఉత్పత్తి, కళాకారులకు ఉపాధి పెంచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి జనగామ జిల్లాలోని పెంబర్తి లోహపు హస్తకళ, వరంగల్ కొత్తవాడలోని చేనేత కార్పెట్లు, తివాచీ(దర్రీస్)ల తయారీలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసింది.

హస్తకళలకు కీర్తి.. పెంబర్తి

జనగామ మండలంలోని పెంబర్తి గ్రామం ఇత్తడి, రాగి, వెండి లాంటి లోహాలతో తయారు చేసే హస్త కళలకు ప్రసిద్ధి. ఈ గ్రామంలోని విశ్వకర్మలు తయారు చేసే హస్తకళా ఉత్పత్తులకు దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో గర్భగుడి ఆలయ ద్వారాలకు ఏర్పాటు చేసిన స్వర్ణతాపడాలు పెంబర్తి విశ్వకర్మల చేతుల్లో రూపుదిద్దుకున్నవే. 800ఏళ్ల క్రితం పురుడుపోసుకున్న ఈ హస్తకళ ప్రపంచ ఖ్యాతి గడిచింది. లోహాలను కరగదీసి రేకులుగా మలిచి దేవతామూర్తుల విగ్రహాలు, కలశాలు, ధ్వజస్తంభ గోపురాలు, ఆలయ గర్భగుడి ద్వారాలకు తాపడాలను తయారు చేస్తుంటారు. పెంబర్తిలో మొదట్లో హస్తకళల కుటుంబాలకు 200పైగా ఉండగా ప్రస్తుతం ఈ వృత్తి నిర్వహించే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం గ్రామంలో వంద కుటుంబాలు ఈ పని మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. మొదట్లో విశ్వకర్మ కుటుంబాల వారే ఈ పని చేయగా కాలక్రమంగా ఇతర కులాలకు చెందిన వారు కూడా వృత్తిని నేర్చుకున్నారు. అయితే ఈ పెంబర్తిలో హస్తకళా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని 2017లోనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి.. స్కీమ్ ఆఫ్ ఫండ్ ఫర్ రీజనరేషన్ ఆఫ్ ట్రెడిషనల్ ఇండస్ట్రీస్ (స్ఫూర్తి) పథకం కింద రూ.1.85 కోట్లను కేటాయించింది. ఇందులో రూ.31లక్షలు విశ్వకర్మల వాటా కాగా మిగతా రూ. 1.54కోట్లు ప్రభుత్వం రాయితీపై ఇచ్చింది. విశ్వకర్మల వాటా చెల్లింపులో ఆలస్యంగా కారణంగా ఐదేళ్ల కస్టర్ల అభివృద్ధి ఆలస్యమవుతూ వచ్చింది. రూ.1.85 కోట్లలో విశ్వకర్మ బ్రాస్, కాపర్, సిల్వర్ ఇండస్ట్రియల్ కోఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.40లక్షలు కాగా.. మిగతా వాటితో అవసమైన యంత్రాల కొనుగోలుకు కేటాయించారు. హస్తకళల ఉత్పత్తిని పెంచాలంటే యంత్రాల వినియోగం అవసరం. దీని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం యంత్రాల కొనుగోలుకు నిధులు కేటాయించింది. ఈ నిధులతో షీట్ కటింగ్, వుడ్ కటింగ్, బెండింగ్, షేపింగ్, పాలిషింగ్, ఎలక్ట్రో ప్లేటింగ్ యంత్రాలను పెంబర్తి విశ్వకర్మ సొసైటీ కొనుగోలు చేసింది. బిల్డింగ్ నిర్మాణం పూర్తి కావడంతో అందులోనే హ్యాండీక్రాఫ్ట్స్ సేల్స్ కౌంటర్‌ను ఇటీవలే ప్రారంభించారు.

కార్పెట్లు, దర్రీస్.. కొత్తవాడ చేనేత ప్రత్యేకత

ఓరుగల్లు.. చేనేత ఉత్పత్తులకు పెట్టింది పేరు. కార్పెట్లయినా, దర్రీస్(తివాచీ)లైనా దేశవిదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. వరంగల్ జిల్లా కొత్తవాడ ప్రాంతంలోని నేతన్నలు మగ్గంపై నేసినవి చూస్తే.. వారి అద్భుత కళను ఔరా అనాల్సిందే. ఇక్కడ సుమారు 2వేల మంది చేనేత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో సుమారు 10వేల మంది కార్మికులు మగ్గం వృత్తిపై ఆధారపడేవారు. కాలక్రమేణా ఆ సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇక్కడి నేతన్నలు నేసిన కార్పెట్లు, దర్రీస్‌లు యూరప్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నేపాల్, జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి ఎగుమతవుతుంటాయి. నెలకు ఐదు వేల పీసుల వరకు ఆర్డర్లు వస్తుంటాయి. వీరు తయారు చేసే కలంకారి దర్రీస్, కీలం కాటన్ దర్రీస్, జూట్ దర్రీస్ అంటే దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఆకులు, నిమ్మకాయలు, బెల్లం, ఇనుము, కరక్కాయలు, పండ్ల రసాలతో తయారు చేసిన రంగులతో కలంకారి దర్రీస్‌లు నేయడం ఇక్కడివారి ప్రత్యేకత. కీలం కాటన్ డిజైన్‌ను చేనేత కార్మికులు చేతులతో నేస్తారు. జనపనారతో తయారు చేసిన రంగులతో జూట్ దర్రీస్‌ను తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన వాటిలో వంద శాతం కాటన్ ఉంటుంది. ఈ మూడు డిజైన్లు విదేశాలకు ఎగుమతవుతాయి.

చేనేత కార్మికులకు చేయూత

వరంగల్ ఉమ్మడి జిల్లాలో 36చేనేత సహకార సంఘాలు, 36 చేనేత పరస్పర సహకార సంఘాలు ఉండగా వీటిలో 20చేనేత సహకార సంఘాలు కేవలం కొత్తవాడలోనే ఉన్నాయి. ఇక్కడ దాదాపు 2వేల మంది కార్మికులున్నారు. ప్రతీ 100మందికి ఓ సంఘం ఉంది. ఈ సహకార సంఘాల ద్వారా చేనేత కార్మికుల ఆర్థిక సహాయాలు, ప్రభుత్వం నుంచి దేశ విదేశాల ఆర్డర్లు ఇప్పించడం, నేత సామగ్రి, పరికరాలను సబ్సిడీపై ఇప్పించడం లాంటి చేస్తే చేనేత వృత్తి ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ప్రముఖుల ఫొటోలతో తివాచీలు

మూడు ఫీట్ల వెడల్పు, ఆరు ఫీట్ల పొడవు కలిగిన కార్పెట్ కిలోబరువు ఉంటుంది. విదేశాలకు ఎగుమతి చేసే దర్రీస్‌లు మూడు అడుగుల వెడల్పు, ఐదు అడగుల పొడవు, కిలోన్నర బరువు ఉంటాయి. ఇక్కడి నేత కార్మికులు ప్రముఖుల ఫొటోలతో కూడా దర్రీస్‌లను తయారు చేస్తారు. మహాత్మగాంధీ, మదర్ థెరిస్సా, రాజీవ్‌గాంధీ, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నరేంద్రమోదీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్, ప్రస్తుత సీఎం ఎ.రేవంత్‌రెడ్డి చిత్రాలతో పాటు చార్మినార్ లాంటి కట్టడాలను డిజైన్లుగా మలిచే ప్రత్యేకత వీరి సొంతం. ఇక్కడ తయారైన ఎర్రతివాచీలు అత్యధిక ప్రభుత్వ ప్రైవేటు వేడుకల్లో వినియోగిస్తూ ఉంటారు. కొత్తవాడ నుంచి పిట్ట రాములు అనే చేనేత కార్మికుడు రాష్ట్రపతి చేనేత అవార్డును అందుకున్నారు. ఇక 2023లో హైదరాబాద్‌లోని జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్‌షోలో ఇక్కడి కార్పెట్లను తమ ప్రతిభతో ఫ్యాషనెబుల్‌గా తయారుచేసి ఫ్యాషన్ షోలో ప్రదర్శించారు.



కాటన్ జూట్ దర్రీస్



పెంబర్తి హస్తకళలో శిక్షణ పొందిన మహిళలు, వారు తయారు చేసిన వస్తువులు (ఫైల్)



మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



రాట్నంపై కండెలు చుడుతున్న చేనేత మహిళా కార్మికురాలు

అధునాతన మగ్గాలు ఏర్పాటు చేయాలి

పిట్ట రాములు, రాష్ట్రపతి చేనేత అవార్డు గ్రహీత



రాబోయే చేనేత కార్మికుల కోసం అధునాతన మగ్గాలను, తివాచీలకు వేసే కలర్ యంత్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న చేనేత కార్మికులంతా వయసు మీద పడ్డవారున్నారు. దీని వల్ల చేనేత కళ అంతరించిపోయే ప్రమాదం ఉంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి.

కళాకారులకు శిక్షణ

హస్తకళాకారులకు వృత్తిలో నైపుణ్యాన్ని పెంచాలన్న లక్ష్యంతో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సెప్టెంబరు 2న పెంబర్తికి చెందిన సీనియర్ హస్తకళాకారుడు అయిలా సోమనర్సింహాచారి నేతృత్వంలో ఈ శిక్షణ ప్రారంభమవగా ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే ఆసక్తి ఉన్న కొత్త కళాకారులను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే హస్తకళల ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా, హ్యాండీక్రాఫ్ట్స్ కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేయించి కళాకారులకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది.

అపురూపం.. అమ్మవారి దర్శనం

కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలు


స్టేషన్‌ఘన్‌పూర్ ఎల్లమ్మ దేవాలయం వద్ద భక్తుల పూజలు


నర్మెటలో అమ్మవారి విగ్రహం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

నర్మెట, అక్టోబరు 5 : శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. మండలకేంద్రంతో పాటు వెల్దండ, మచ్చుపహడ్ గ్రామాలలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండలకేంద్రంలో మసీదు గడ్డ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారి వద్ద మండలకేంద్రానికి చెందిన జంగిటి అంజయ్య అన్నదానం చేశారు. భక్తులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం 3వ రోజు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో, హనుమాన్ జ్యోతిషాలయం, శివునిపల్లి గాంధీ విగ్రహం, లలితాంబికా దేవాలయంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని అన్నపూర్ణ దేవి కవచ రూపంలో కూరగాయలతో అమ్మ వారిని అలంకరించారు. ఎల్లమ్మ దేవాలయం వద్ద పూజారి శేఖర్ శర్మ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం 1000 మందికి మహా అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గడ్డం కృష్ణమూర్తి, గన్ను కార్తీక్, విష్ణు శంకర్, సరాబు శశిక్, ఉమా శంకర్, బంగ్లా శ్రీను, వి.సురేందర్, పి.రంజిత్, వినయ్, వనం దిలీప్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, ఎం.విజయ్‌కుమార్, ఎం.విజయ్, వంశీ, తరుణ్, ఏ.సతీష్, ఎన్.బ్రహ్మచారి పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : మండల కేంద్రమైన జఫర్‌గడ్‌తో పాటు మండలంలోని కూనూరులో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణదేవిగా అలంకృతులై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, వం టి విశిష్ట పూజలు, అర్చనలు గావించారు. ప్రత్యేక పూజలు చేశారు.

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని ఆర్య క్షత్రియ భవనం ముందు ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్-స్వప్న దంపతులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పూజారి పిండిప్రోలు శ్రీనివాస శర్మ, మండల కాంగ్రెస్ నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి, గాదె రమేష్, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవిందర్, చీమలపాటి శ్రీనివాస్, బుస్సారి భానుజీ, కోళ్ల సాయికుమార్ గౌడ్, రఘు, మధు, లక్ష్మణ్, లింగంపల్లి నర్సింగరావు, కిషన్‌జీ పాల్గొన్నారు.

ఆవిర్భావ సదస్సుకు తరలిరావాలి

జఫర్‌గడ్, అక్టోబరు 5 : తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) ఆవిర్భావ సదస్సుకు తరలిరావాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్న కోరారు. శనివారం ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి జఫర్‌గడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన, వనరుల సంరక్షణ, ప్రజా సంక్షేమం అభివృద్ధియే లక్ష్యంగా 2010, అక్టోబర్ 9న దివంగత ప్రజా గాయకుడు గద్దర్ నేతృత్వంలో టీపీఎఫ్ ఏర్పడిందన్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవనంలో నిర్వహించే టీపీఎఫ్ 15వ ఆవిర్భావ సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పాకాల వెంకన్న కోరారు. సమావేశంలో టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇల్లందుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జఫర్‌గడ్, అక్టోబరు 5 : అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని ఉప్పుగల్లుకు చెందిన కస్తూరి రవి మృతదేహాన్ని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ సందర్శించి నివాళులు అర్పించారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి ఆయన బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. రవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి.. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా, మండల నేతలు పులి రాజు, తిరుపతి, గాదెపాక చిరంజీవి, నేరెళ్ల రాజు, బైరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ మృతి

జనగామ రూరల్, అక్టోబరు 5: జనగామ జిల్లా కేంద్రానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి, చైతన్య జూనియర్ కళాశాల అధినేత మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ (72) శనివారం మృతి చెందాడు. గత కొద్ది రోజులు నుంచి తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో స్వగృహానికి మృతదేహాన్ని తరలించగా పలువూరు ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చిలుపూర్, అక్టోబరు 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శనివారం ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... గత నెల 13న మండలంలోని రాజవరానికి చెందిన జక్కుల కొమురయ్య (52) అనే రైతు తాటికాయల గ్రామానికి వెళ్ళే మార్గంలో ఉన్న తన వ్యవసాయ పొలానికి సైకిల్‌పై వెళ్ళి తిరిగి వస్తుండగా, చిన్నపెండ్యాల నుంచి చిలుపూర్ వైపు వేగంగా వెళ్తున్న ఎర్టిగా కారు అతన్ని బలంగా ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో కొమురయ్య కిందపడడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు అతన్ని ఆస్పత్రికి తరలించగా అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున కొమురయ్య మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు యాజమాని సుంక సాంబరాజుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

చిలుపూర్, అక్టోబరు 5 : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శ్రీపతిపల్లిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పిట్టల రాజు (38) తనకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొద్ది నెలలుగా అతడు తాగుడుకు బానిస కావడంతో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీనికి తోడు అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం మద్యం మత్తులో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కాగా, మృతుడు రాజుకు భార్య సరితతో పాటు, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

9న జనగామకు తిరుమలేశ్ మృతదేహం

జనగామ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉగాండాలో సెక్యూరిటీ గార్డ్ చేతిలో హత్యకు గురైన జనగామకు చెందిన ఇంజినీర్ ఇటికాల తిరుమలేశ్ మృతదేహం జనగామకు వచ్చేందుకు ఆలస్యం కానుంది. ఉగాండాలో శని, ఆదివారాలు సెలవులు కావడంతో పోస్టుమార్టం, ఇతర ప్రక్రియ అంతా పూర్తి కావడానికి సమయం పట్టనుంది. సోమవారం ఉదయం పోస్టుమార్టం, ఇతర ఫార్మాలటీస్ పూర్తి కాగా.. మంగళవారం సాయంత్రం బయలుదేరితే బుధవారానికి మృతదేహం జనగామకు వచ్చే అవకాశం ఉందని మృతుని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా.. తిరుమలేశ్ హత్యకు సెక్యూరిటీ గార్డ్‌కు తక్కువ జీతం రావడమే కారణంగా అక్కడి పోలీసులు నిర్ధారించారు. ఉగాండా పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్(యూపీడీఎఫ్) కు చెందిన 38 ఏళ్ల సైనికుడు జేమ్స్ టోలిట్ ఓపియో అక్కడి నిర్మాణ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. అక్టోబరు 3న స్థానికంగా డిస్కోకు వెళ్లిన ఓపియో అక్టోబరు 4న తెల్లవారుజామున 4 గంటలకు డ్యూటీకి వచ్చినట్లు అక్కడి పోలీసులు అక్కడి మీడియాకు వివరించారు. తనకు తక్కువ జీతం వచ్చిందనే కోపంతో ఉన్న ఓపియో సైట్ ఇంజినీర్‌గా ఉన్న తిరుమలేశ్‌ను కాల్చి తనను తాను కాల్చుకున్నట్లు సమాచారం.

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

దేవరుప్పుల, అక్టోబరు 5: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఐఈవో జితేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈసందర్భంగా బతుకమ్మ ఆట-పాటలతో కళాశాల ప్రాంగణం హోరెత్తింది. కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నామిని పావని కుమారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

గ్రామ సమీపంలో పిడుగు

బచ్చన్నపేట, అక్టోబరు 5: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోని కాళ్ల నర్సింహులు వ్యవసాయ బావి వద్ద శనివారం మధ్యాహ్నం పిడుగుపడిందని స్థానికులు తెలిపారు. అప్పటి వరకు అక్కడ పనిచేసిన రైతులు వర్షం వస్తుందని గ్రామంలోకి రాగా కొద్ది నిమిషాల తేడాతో తాటి చెట్టుపై, కళ్లంలో పిడుగు పడింది. పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

ఘనంగా వెంకటస్వామి జయంతి వేడుకలు


వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 5: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలు శనివారం జనగామలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించార అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీవైఎస్‌వో వెంకట్‌రెడ్డి, డీపీవో రామారావు, బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్, జౌళి శాఖ అధికారిణి చౌడేశ్వరి, డీఎంహెచ్‌వో రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా జరిగేలా చూడాలి : డీపీవో


బచ్చన్నపేటలో శిక్షణ ముగించుకున్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న డీపీవో

బచ్చన్నపేట, అక్టోబరు 5: గ్రామాల్లో నీటటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని డీపీవో స్వరూప రాణి కోరారు. గత నాలుగు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల నీటి సహాయకులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన డీపీవో మాట్లాడుతూ మంచినీటి సరఫరా సక్రమంగా సాగాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సహాయకులకు శిక్షణ నివ్వాలని నిర్ణయించిందన్నారు. శిక్షణకు హాజరైన వారికి ధృవీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం డీపీవో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులు, పన్నుల వసూళ్లు, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లిఖార్జున్, శిక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ నెల 7న ఉచిత చేప పిల్లల పంపిణీ

జనగామ రూరల్, అక్టోబరు 5: ఈనెల 7న స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనగామ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో మత్స్యశాఖ అధికారి, సీడ్ కాంట్రాక్టర్లతో మత్స్య పారిశ్రామిక సహకార సంఘ నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నీల రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రిజర్వాయర్‌లో 80 ఎంఎం నుంచి 100 ఎంఎం, చెరువులు, కుంటలలో 35ఎంఎం నుంచి 40 ఎంఎం పరిమాణం ఉన్న చేప పిల్లలను సరఫరా చేయాలన్నారు. ఈనెల 7న స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్‌లో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.వెంకటయ్య, వై.రాజు, పి.రాజు, సంపత్, నిమ్మల స్వామి, రాములు, శంకర్, సత్తయ్య, కుమారస్వామి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన నూనెల ధరలను తగ్గించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 5: కేంద్ర ప్రభుత్వం పెంచిన మంచి నూనెల, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రంలో మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సీపీఎం మహసభలకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని నాయకులతో కలిసి మాట్లాడారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర ప్రభుత్వంకు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ధరలను తగ్గించాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు, ఇర్ర అహ ల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, గట్ల మల్లారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఢీకొట్టిన అదనపు కలెక్టర్ కారు

(5వ పేజీ తరువాయి)

రోజుల క్రితం జనగామలో నివాసముంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లింది. తిరిగి ఇప్పగూడెం వెళ్లే క్రమంలో జనగామ నుంచి బస్సులో వచ్చి ఘన్‌పూర్ బస్టాండ్‌కు ఎదురుగా జనగామ- హనుమకొండ రహదారిపై బస్సు దిగింది. ఘన్‌పూర్ బస్టాండ్‌లోకి వెళ్లేందుకు గాను రహదారి క్రాస్ చేస్తుండగా జనగామ నుంచి హనుమకొండ వైపు వెళుతున్న సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ వీ.ఎస్.లత కారు వృద్ధురాలిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా బాధితురాలి వెంట అదనపు కలెక్టర్ వరంగల్ ఎంజీఎంకు వెళ్లారు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా సంబంధిత విషయమై సీఐ జి.వేణును వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

'మెడికల్' విద్యార్థినులకు భోజనం బంద్?

- గర్ల్స్‌కు మూడు రోజులుగా అందని అన్నం

- ఆర్డర్ పెట్టుకొని, బయటకు వెళ్లి తింటున్న విద్యార్థులు

జనగామ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జనగామ మెడికల్ కాలేజీ విద్యారినులకు గత మూడు రోజులుగా భోజనం బంద్ అయినట్లు తెలుస్తోంది. విద్యార్థినులకు భోజనాన్ని సరఫరా చేయాల్సిన డైట్ కాంట్రాక్టర్ భోజనాన్ని నిలిపివేసినట్లు తెలుస్తోంది. జనగామ మెడికల్ కాలేజీకి చెందిన విద్యార్థినులకు జిల్లాకేంద్రంలోని ధర్మకంచ ఎస్సీ బాలికల హాస్టల్‌లో వసతి కల్పించారు. ఇక్కడ సుమారు 60 మంది విద్యార్థులు ఉంటూ కాలేజీ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సు ద్వారా చంపక్‌హిల్స్‌లోని మెడికల్ కాలేజీకి వెళ్లి విద్యనభ్యసిస్తుంటారు. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉన్న విద్యార్థినులకు డైట్ కాంట్రాక్టర్ భోజనం సరఫరా చేయడం నిలిపివేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. ఆకలిని తట్టుకోలేక విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా ఫుడ్ ఆర్డర్ పెట్టుకొని తింటున్నట్లు సమాచారం. కాగా.. ఈ విషయమై మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విద్యార్థినులు దసరా సెలవులకు ఇళ్లకు వెళ్లారన్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో 8 మంది మాత్రమే ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు భోజనం విషయంలో కాలేజీకి సంబంధం లేదని, పేరెంట్స్ కమిటీయే డైట్ కాంట్రాక్టర్‌ను నియమించుకుంటుందని తెలిపారు. తమకు భోజనం బంద్ అయిన విషయాన్ని విద్యార్థినులు ఇంతవరకూ తన దృష్టికి తీసుకురాలేదని తెలిపారు.

డిజిటల్ సర్వే పక్కాగా జరగాలి


డిజిటల్ సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రఘునాథపల్లి, అక్టోబరు 5: అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం జారీ చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం నిర్వహిస్తున్న సర్వే సంపూర్ణ స్థాయిలో పక్కాగా జరగాలని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప అన్నారు. మండలంలోని మాదారం గ్రామంలో శనివారం మూడో రోజు నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి స్వరూప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర స్థాయిలో సర్వే నిర్వహణను వంద శాతం పూర్తి చేయాలని సర్వే నిర్వహిస్తున్న అధికారులకు సూచించారు. సర్వే కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, డిఎల్‌పీవో వెంకట రెడ్డి, ఆర్‌ఐలు సాయిబాబా, కిషోర్, పంచాయతీ కార్యదర్శి అంతగల్ల కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.

టీపీసీసీ ఛీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకుడు రంగు రమేష్


టీపీసీసీ ఛీఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రమేష్

చిలుపూర్, అక్టోబరు 5 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా (టీపీసీసీ ఛీఫ్) ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను, మండల ంలోని శ్రీపతిపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు రంగు రమేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్నందజేశారు. శనివారం నిజామా బాద్ పట్టణంలోని ఆయన నివాసంలో మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసిన రంగు రమేష్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు. మహేశ్‌గౌడ్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు పోలబోయిన నరేష్, రంగు సతీష్, ముక్కెర రవి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి వార కల్యాణం


వార కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

చిలుపూర్, అక్టోబరు 5 : మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి వార కల్యా ణాన్ని వేడుకగా నిర్వహించారు. శనివారం ఆలయ ఆవరణలో చేపట్టిన కళ్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యుల వేదమంత్రాల మధ్య వేంకటేశ్వర స్వామి - పద్మావతి అమ్మవార్ల కల్యాణ వేడుకలను వైభ వంగా ముగించారు. అనం తరం భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి నిత్యసేవకులు, ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్ రావు - కిరణ్మయి దంపతులతో పాటు, మాజీ ధర్మకర్త సంగోజు మోహ నాచారి, ఆలయ ఈవో మోహన్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాట నిలుపుకోవాలి

నర్మెట, అక్టోబరు 5 : ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఫలితాలు విడుదల చేయడం మాదిగలకు, ఉపకులాలకు అన్యాయం చేయడమేనని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పాడని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్ అన్నారు. శనివారం నర్మెట మండలకేంద్రంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దల కిషోర్ మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో దేశంలో మేమే ముందు వర్గీకరణ అమలు చేస్తామని, ఆర్డినెన్స్ తీసుకోచ్చైన అన్ని నోటిఫికేషన్‌లలో వర్గీకరణ ప్రకారమే ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడుతామని హామి ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను తప్పి ద్రోహం చేశాడన్నారు. అక్టోబరు 9న తెలంగాణ వ్యాప్తంగా, జనగామ జిల్లాలో నల్ల జెండాలతో నిరసన ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. కొంపెల్లి అంబేద్కర్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 5: సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చే ప్రయాణికులను ఆటోలలో గమ్య స్థానాలకు చేరవేసే క్రమంలో తగు జాగ్రత్తలు పాటించాలని ఏఎస్పై రాజమౌళి తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్‌లకు ఏఎస్సై పలు సూచనలు చేశారు. ప్రయాణికులు ఎక్కువ మంది వస్తున్నారని ఓవర్‌లోడ్‌తో తీసుకెళ్లవద్దు అని సూచించారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్‌గా వెళ్లి ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. ప్రతీ డ్రైవర్‌కు విధిగా లైసెన్స్ ఉండాలని, రాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు

రఘునాథపల్లి, అక్టోబరు 5: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం మండల కార్యదర్శి మహేందర్ అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో శనివారం జరిగిన సిపిఎం గ్రామ మహాసభ సందర్భంగా ర్యాలీ నిర్వహించి సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు పండుగ అంజనేయులు, శివార్ల చిన్న అంజయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డుతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా సజ్జన మల్లేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్యార నర్సింగరావు, రమ, గ్యార శారద, స్వరూప, లక్ష్మి, ఉమారాణి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ పరామర్శ

లింగాలఘణపురం, అక్టోబరు5: మండలంలోని వడ్డిచర్ల, నేలపోగుల, గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలువురు బాధిత కుటుంబాలను శనివారం తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పరామర్శించారు. ఈసందర్భంగా మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరు శివకుమార్, దిలీప్‌రెడ్డి, దామెర నాగరాజు, ఏలె మూర్తి, బుషిగంపల అంజనేయులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ (55) కుటుంబానికి అండగా ఉంటామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సింగపురం ఇమ్మానుయెల్ రాజ్ తెలిపారు. ఇటీవల శ్రీనివాస్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఇమ్మానుయెల్ రాజ్ శనివారం మండలంలోని తానేధార్‌పల్లి గ్రామంలోని మృతుడి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అంది ంచారు. సింగపురం దయాకర్, నాగయ్య, లింగారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అక్టోబరు 5: జిల్లాలో లయన్స్ క్లబ్‌లో పోటీ తత్వంతో దీనులు, పేదలను ఆదుకోవడానికి ముమ్మరంగా కార్యక్రమాలు చేపట్టాలని లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్టేషన్ ఘన్‌పూర్ లయన్స్ భవన్‌లో ఘన్‌పూర్, శివునిల్లి, రఘునాథపల్లి క్లబ్‌ల బాధ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లయన్స్ క్లబ్‌లలో బాధ్యులతో పాటు సభ్యులందరినీ భాగస్వాములుగా చేస్తు నిత్యం సేవా కార్యక్రమాలు చేట్టాలన్నారు. క్లబ్‌లలో నూతన సభ్యులను చేర్పించడంతో పాటు పాత సభ్యులను కాపాడుకోవాలన్నారు. సమావేశంలో వీడీజీ జాన్‌బన్నీ, జిల్లా బాధ్యులు సయ్యద్ అబిద్, సుధాకర్ రెడ్డి, హరికిషన్ రెడ్డి, రమణారెడ్డి, మామిడాల వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, దస్తగిరి, ఉపేందర్, డాక్టర్ ఎం.కరుణాకర్ రెడ్డి, రవీందర్, ఎ.మధు, కె.రమేశ్, డాక్టర్ చారి, టి.రవికిరణ్, జి.సంపత్, గట్టు రమేశ్ పాల్గొన్నారు.

భక్తుల గిరి ప్రదక్షిణ


స్వామి వారి ప్రదక్షిణలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జఫర్‌గడ్, అక్టోబరు 5 : శ్రీవేల్పుగొండ లక్ష్మీ నర్సింహస్వామి కొండ చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. మండల కేంద్రంలో శనివా రం భక్తులు కాలినడకన బయలుదేరి.. స్వామి వారు వెలసిన కొండ కింది భాగంలో గల పెద్ద చెరువు గిద్దె ప్రాంతం నుంచి పాతూరులోని గం టల గుడి మీదుగా.. సింగరాయని ఆలయం దిగువ నుంచి స్వామి వారి కొండ దిగువన గల శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం వద్దకు భక్తజన బృందం చేరుకుని ప్రదక్షిణను పూర్తి చేశారు. ఈ ప్రదక్షిణలో పాతూరులోని ఆంజనేయస్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. సుమారు 8 కిలోమీటర్ల దూరం, సుమారు రెండున్నర గంటల పాటు కొండ చుట్టూ భక్తులు ప్రదక్షిణ గావించారు. ఈ ప్రదక్షిణలో భక్తబృం దం ప్రతినిధులు పల్లా సుధాకర్, సిహెచ్.కృష్ణమూర్తి, శ్రవణ్‌కుమార్, పానుగ ంటి సోమయ్య, దాంశెట్టి, సోమేశ్వర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

పోరాటయోధులను ఆదర్శంగా తీసుకోవాలి



కొమురయ్య స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కేరళ బృందం

దేవరుప్పుల, అక్టోబరు 5: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చారిత్రక నేపథ్యం కలిగిన వీర తెలంగాణ సాయుధ, రైతాంగ పోరాట యోధుల స్మారకస్థూపాలను శనివారం కేరళ సీపీఎం యుటీఎఫ్ బృందం సందర్శించింది. కడవెండిలోని తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య స్మారకస్థూపంతో పాటు, కామారెడ్డిగూడెంకు చెందిన తెలంగాణ రైతాంగ పోరాటయోధుడు షేక్ బందగీ స్మారకస్థూపం, సమాధిని కేరళ సీపీఎం సభ్యులు సందర్శించారు. అదే విధంగా ధర్మాపురంలోని తెలంగాణ రైతాంగపోరాట యోదుడు జాటోతు ఠాణూనాయక్ స్మారకస్థూపాన్ని సందర్శించి, ఆయన సోదరుడు ధర్మానాయక్‌తో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సింగారపు రమేష్, ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, పాలకుర్తి మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు జె. నాగేశ్వర్‌రావు, రాయల శ్రీనివా సరావు, జక్కంపూడి కృష్ణ, జితేష్ తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిన కేంద్రాలను కేరళ సీపీఎం, యూటీఎఫ్ బృందంలో జితేష్, శ్రీనివాసన్ కృష్ణ శనివారం పాలకుర్తి మండలంలోని పాలకుర్తి, విస్నూరు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం చిట్యాల సోమన్న, ఖమ్మం జిల్లా కమిటి సభ్యుడు బండారు రమేష్‌లు ఈ ప్రాంతానికి ఘనమైన చరిత్రను వివరించారు.ఈ సందర్భంగా జితేష్, శ్రీనివాసన్ కృష్ణ మాట్లాడుతూ సీపీఎం మండల కార్యదర్శులు మాచెర్ల సారయ్య, సాదం రమేష్, నాగేశ్వరరావు, రాయల శ్రీనివాసరావు, కృష్ణ ఉన్నారు.

అశ్రునయనాల మధ్య నూకల నరేశ్‌రెడ్డి అంత్యక్రియలు

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు, ప్రతిపక్షనాయకులు


నరేశ్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న కడియం


పాడె మోస్తున్న దయాకర్‌రావు

మరిపెడ/స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 5 : కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి అంత్యక్రియలు అభిమానుల అశ్రునయనాల మధ్య శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో పూర్తయ్యాయి. నరేశ్‌రెడ్డి అంత్యక్రియలకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి పార్టీలకతీతంగా నేతలు, అభిమానులు తరలొచ్చారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఆర్.సురేందర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ప్రభుత్వవిప్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్, ఖమ్మం ఎంపీలు బలరాంనాయక్, రఘురామ్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నరేష్‌రెడ్డి భౌతికాయం వద్ద నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, పరకాల, మహబూబాబాద్, ఇల్లెందు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, కోరం కనకయ్యతో పాటు తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సత్యవతి, రవీందర్‌రావు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, వరంగల్ మాజీమేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వరదరాజేశ్వర్‌రావు, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు, కాంగ్రెస్ నేతలు యుగేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, మరిపెడ మునిసిపల్ చైర్మన్ సింధూరకుమారి, మాజీ ఎంపీపీ అరుణరాంబాబు, మాజీ జడ్పీటీసీ శారదరవీందర్, అచ్యుత్ రావు, తాళ్లపెల్లి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి హాజరై నరేశ్‌రెడ్డికి నివాళులర్పించారు.